తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY
సంపుటి : 23 సంచిక : 39 | గురువారం జనవరి 23 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

జయలలిత బయోపిక్.. అందుకే చేయలేదు : నిత్యామేనన్

8 లో..

## ఇదండీ..కబురు..




మొత్తం కాకపోయినా
సగం మాత్రం గ్యారంటీ!




# దావోస్‌లో ఒకే వేదికపై ముగ్గురు సీఎంలు

**కబురు,హైదరాబాద్ జనవరి 22:**
దావోస్‌లో జరుగుతోన్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. మన దేశం నుంచి వెళ్లిన ముగ్గురు సీఎంలు ఒకే వేదికపై కనిపించారు. అదీ సౌత్ ఇండియా రాష్ట్రాల నుంచి వెళ్లిన ముగ్గురు సీఎంలు ఒకే చోట కలిశారు. ఆ ముగ్గురు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్.ఈ ముగ్గురు ముఖ్యమంత్రులు 2025, జనవరి 22వ తేదీ ఉదయం ఒకే వేదికపై తమ అనుభవాలను పంచుకున్నారు. 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' సమావేశంలో భాగంగా ఈ ముగ్గురు ముఖ్యమంత్రులు ఒకే వేదికపై కనిపించారు. దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులు రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అలా కలిసినప్పుడు తీసిందే ఈ ఫొటో..

## హైదరాబాద్‌లో కొత్తగా హెచ్‌సీఎల్ టెక్ సెంటర్

3.20 లక్షల విస్తీర్ణంలో క్యాంపస్ ఏర్పాటు
విస్తరణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం



2లో..

# ఇంకెన్నాళ్లు ఇలా దరఖాస్తుల జాతర



- ఎన్నిసార్లు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలి
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

**కబురు, సిద్దిపేట,జనవరి 22:**
దరఖాస్తుల పేరుతో ప్రజల ఉసురు ఎందుకు పోసుకుంటున్నారు ప్రజల డబ్బులు ఎందుకు వృధా చేస్తున్నారని బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు ప్రశ్నించారు.

# పదేండ్ల తర్వాత గ్రామసభలు..

## అర్హులందరికీ పథకాలు అందజేస్తం: మంత్రి సీతక్క

= గతంలో ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకే పథకాలు
= ఇప్పుడు ప్రజల సమక్షంలోనే ఎంపిక
= నిన్న 3,410 గ్రామాల్లో సభలు పెట్టాం
= 142 ఊళ్లలోనే ఆందోళనలు జరిగినయ్
= ఆ 4% గ్రామాల్లోనూ గొడవ చేసింది బీఆర్ఎస్ వాళ్లే
= గ్రామ సభల్లోనూ దరఖాస్తుల స్వీకరణ
= అర్హులందరికీ పథకాలు అందజేస్తం
= మీడియాతో మంత్రి సీతక్క చిట్ చాట్



**కబురు,హైదరాబాద్ జనవరి 22:**
పదేండ్ల తర్వాత తెలంగాణలో గ్రామ సభలు జరుగుతున్నాయని మంత్రి సీతక్క అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకే పథకాలు అందేవని, ఫాంహౌస్ లలో లబ్దిదారుల జాబితాలు తయారయ్యేవని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా పథకాలు అందించనుందని చెప్పారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమక్షంలోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. ఇవాళ మంత్రి మీడియాతో చిట్ చాట్ చేశారు. నిన్న రాష్ట్ర వ్యాప్తంగా 3,410 గ్రామాల్లో సభలు నిర్వహించామని అన్నారు. కేవలం142 గ్రామాల్లోనే ఆందోళనలు జరిగాయని అన్నారు.అంటే కేవలం 4% గ్రామాల్లోనే గొడవలు జరిగాయని తెలిపారు. అది కూడా బీఆర్ఎస్ నాయకులు కావాలనే గొడవలు చేయించారని చెప్పారు. 96% గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో సభలు జరిగినట్టు మంత్రి చెప్పారు. మిగతాద్ది 2 లో



## బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై కన్నెత్తి చూసినా ఊరుకోం

- 60 లక్షల మంది సైనికులు ఉన్నా పార్టీ బీఆర్ఎస్
- కార్యాలయాలపై దాడి చేసే దరిద్ర్యపు సంస్కృతి కాంగ్రెస్‌ది : కల్వకుంట్ల కవిత

**కబురు, నల్లగొండ,జనవరి 22:**
బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై కన్నెత్తి చూసినా ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కల్వకుంట్ల కవిత.. 60 లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం తమ బీఆర్ఎస్ పార్టీ అని, తమ పార్టీ కార్యాలయాలపై, ఇళ్లపై దాడులుకు భయపడే ప్రసక్తే లేదన్నారు. తమ పార్టీ కార్యకర్తలు తలుచుకుంటే తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి కూడా ఉండదని హెచ్చరించారు. ఖబర్దార్ కాంగ్రెస్ నాయకులారా.. జాగ్రత్తగా ఉండండి, ఇంకోసారి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోరు అంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. రౌడీ మూకలతో ఇతరుల పార్టీ కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి తమది కాదని చెప్పారు. మూసీ మురికిమయం కావడానికి కారకులు ఎవరో ప్రజలు ఇప్పటికైనా గుర్తించాలని కవిత చెప్పారు.

మిగతాది 2లో

### రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకే

# రక్షణ లేదు

- సోయిలేని కాంగ్రెస్ పాలన
- దాడి చేసిన వారిపై కాకుండా బాధితులపై కేసులా
- ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు

**కబురు,హైదరాబాద్ జనవరి 22:**

2 లో







## పెళ్లైన జంటలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుడ్ న్యూస్

- ప్రతి ఒక్కరికీ 6 కిలోల సన్నబియ్యం
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- సాగుయోగ్యమైన ప్రతి ఎకరాకూ రైతు భరోసా
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు
- మిస్సయిన వాళ్లు మళ్లీ దరఖాస్తు చేయాలె
- పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**కబురు, కరీంనగర్ జనవరి 22:**
రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా సాగుతుందని పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. ఇవాళ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంటలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..


మిగతాద్ది 2 లో




## నా ఒక్కడిపైనే కాదు..

### ఇండస్ట్రీ మొత్తం మీద ఐటీ దాడులు

**కబురు,హైదరాబాద్ జనవరి 22:**
టాలీవుడ్ ఇండస్ట్రీ ప్రముఖుల ఇండ్లపై జరుగుతోన్న ఇన్‌కమ్ ట్యాక్స్ (ఐటీ) రైడ్స్ పై ప్రముఖ నిర్మాత దిల్ రాజ్ స్పందించారు. నా ఒక్కడి పైనే ఐటీ దాడులు జరగడం లేదని.. టాలీవుడ్ ఇండస్ట్రీ మొత్తం మీద ఐటీ రైడ్స్ జరుగుతున్నాయని తెలిపారు. ప్రొడ్యూసర్ దిల్ రాజ్ తో పాటు మైత్రీ మూవీ మేకర్స్, డైరెక్టర్స్ అనిల్ రావిపూడి, సుకుమార్‌తో పాటు మరికొందరు టాలీవుడ్ ప్రముఖుల ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. మంగళవారం (జనవరి 21) ఉదయం మొదలైన ఐటీ అధికారుల తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి.



## ఎవరెన్ని చెప్పినా నమ్మకండి..

### అర్హులందరికీ 4 పథకాలు

### - మంత్రి పొన్నం

**కబురు,హైదరాబాద్ జనవరి 22:**
గణతంత్ర దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను లాంఛనంగా ప్రారంభించనుంది. అయితే.. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు స్పష్టంగా విధి విధానాలు రూపకల్పన చేయగా.. రేషన్ కార్డుల గైడ్స్ లైన్స్ విషయంలో గందరగోళం నెలకొంది. ప్రజలు అయోమయానికి గురి అవుతున్నారు. ఈ క్రమంలో రేషన్ కార్డుల జారీపై మంత్రి పొన్నం ప్రభాకర్ క్లారిటీ ఇచ్చారు. బుధవారం (జనవరి 22) కరీంనగర్ జిల్లాలోని నారాయణపూర్ గ్రామంలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నాలుగు పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న నేపథ్యంలో రకరకాలుగా కొందరు మాట్లాడుతున్నారు.. ఈ సందర్భంగా జాబితాలో మీ పేర్లు లేవని కొందరు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తారు.. ఎవరు ఎన్ని చెప్పినా నమ్మకండని సూచించారు.

మిగతాద్ది 2 లో

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# భవిష్యత్తు బంగారమేనా?

అనుకున్నదే అయింది. అమెరికా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తూనే డొనాల్డ్ ట్రంప్ తన మాటలు, చేతలు, చేష్టల ద్వారా సంచలనాలు సృష్టించారు. గతంలో దేశానికి 45వ అధ్యక్షుడిగా పనిచేసి, తాజాగా 47వ అధ్యక్షుడిగా సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేసిన ట్రంప్ తన తొలి ప్రసంగంలోనే 'ఇక నుంచి అమెరికాకు స్వర్ణయుగం' అంటూ అమెరికన్లలో ఆశలు, ఆకాంక్షలు పెంచారు. అయితే, 'అమెరికాను మళ్ళీ ఘనమైన దేశంగా తీర్చిదిద్దాల'ని (మాగా) నినదిస్తూ ఆయన ప్రకటించిన కొన్ని చర్యలు ఆధిపత్య, విస్తరణవాదానికి ప్రతీకగానూ ప్రతిధ్వనించాయి. వర్తమాన ప్రపంచ అధికార క్రమాన్ని మార్చివేసే పలు చర్యలకు నడుం బిగి స్తున్న తీరు, అలాగే కోవిడ్, చైనాలను సాకుగా చూపుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి, అలాగే పర్యావరణ రక్షణపై ప్యారిస్ ఒప్పందం నుంచి పక్కకు తప్పుకుంటున్నట్లు ప్రకటించడం ప్రపంచాన్ని నివ్వెరపరుస్తోంది. ట్రంప్ పదవీ ప్రమాణ స్వీకారం పైకి సాదాసీదా అధికార మార్పిడిగా అనిపించవచ్చు. రాజకీయ ప్రత్యర్థులు సైతం చిరునవ్వులు చిందిస్తూ సౌహార్దం చూపుకుంటున్నట్టు కనిపించవచ్చు. అంతమాత్రాన అంతా మామూలే అనుకొంటే పొరపాటు. పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో దర్శనమిచ్చిన ఐక్యతకు భిన్నంగా ప్రత్యర్థులపై తుపాకులు ఎక్కుపెట్టిన తీరు ఆయన ప్రసంగంలో స్పష్టంగా వినిపించింది. కునారిల్లిన దేశాన్ని తాను మాత్రమే మళ్ళీ పునరుత్తేజితం చేయగలనన్న భావన కలిగించడంతో పాటు ఆయన ఒకటికి రెండు జాతీయ ఎమర్జెన్సీలు ప్రకటించడం పెను పర్యవసానమే. అలాగే, చైనా నుంచి పనామా కాలువను వెనక్కి తీసుకోవాలని పిలుపునివ్వడమూ వివాదాస్పదమే. బలప్రయోగం ద్వారా మాత్రమే సాధ్యమయ్యే అలాంటి పనుల ప్రస్తావన నిప్పుతో చెలగాటానికి సిద్ధమని స్పష్టం చేయడమే. ఇక, గద్దెనెక్కిన తొలిరోజునే 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో'ను 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా ట్రంప్ ప్రకటించడంతో రానున్న రోజుల్లో అంతర్జాతీయంగా మరెన్ని ఆశ్చర్యకర పరిణామాలు చోటుచేసుకుంటాయనే ఉద్విగ్నత నెలకొంది. పదవి చేపడుతూనే ట్రంప్ చకచకా సంతకాలు చేసిన పదుల సంఖ్యలోని కార్యనిర్వాహక ఆదేశాలు ఆసక్తికరం. పర్యావరణ పరిరక్షణను గాలికొదిలేయడం, జన్మహక్కుగా సంక్రమించే పౌర సత్వంపై అమెరికా రాజ్యాంగాన్ని సైతం తోసిపుచ్చడం లాంటివి ఇట్టే మింగుడుపడే అంశాలు కావు. జాతీయతతో సంబంధం లేకుండా దేశంలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నవారికి పుట్టినబిడ్డలకు సైతం 150 ఏళ్ళ పైచిలుకుగా అమెరికా పౌరసత్వం దక్కుతూ వచ్చింది. కానీ, నెల రోజుల్లో అమలులోకి రానున్న తాజా ఆదేశం ఫలితంగా ఇప్పుడిక అలాంటి పిల్లలకు పౌరసత్వ పత్రాలివ్వరు. అదేమంటే, 1868లో చేసిన 14వ సవరణ కింద అమెరికా గడ్డపై పుడితేచాలు ఆ పిల్లలకు మారుమాట లేకుండా పౌరసత్వమివ్వాలనేమీ లేదనీ, సవరణను తప్పుగా వ్యాఖ్యానించారనీ ట్రంప్ వాదన. తాత్కాలిక వీసాలతో అమెరికాలో నివసిస్తూ, ఉద్యోగాధారిత గ్రీన్‌కార్డ్‌కై దీర్ఘ కాలంగా నిరీక్షిస్తున్న 10 లక్షల పైచిలుకు మంది భారతీయులకు ఈ కొత్త నిర్ణయం అశనిపాతమే. ఇప్పటికే కొన్నిచోట్ల ఇమ్మిగ్రేషన్ లాయర్లు కోర్టుకెక్కిన ఈ ఆదేశం గనక అమలైతే, తాత్కాలిక వర్క్ వీసాలు, టూరిస్ట్ వీసాలపై అగ్రరాజ్యంలో ఉంటున్నవారి సంతానానికి అక్కడి పౌరసత్వ ఆశలు అడుగంటినట్లే. 2022 నాటి అమెరికా జనాభా లెక్కలపై ప్యూ రిసెర్చ్ విశ్లేషణ ప్రకారం అమెరికాలో 48 లక్షల మంది భారతీయ అమెరికన్లుంటే, వారిలో మూడింట రెండొంతుల మంది వలసజీవులే. కేవలం 34 శాతం, మరో మాటలో 16 లక్షల మంది మాత్రం అగ్రరాజ్యంలోనే పుట్టారు. ఇక, చట్టవిరుద్ధమైన వలసల్ని అడ్డుకుంటాననీ, సరైన పత్రాలు లేని లక్షలాది వలస జీవుల్ని దేశం నుంచి పంపివేస్తాననీ ట్రంప్ చేసిన గర్జన కూడా లక్షలమందికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆ జాబితాలో మెక్సికో (40 లక్షలు), ఎల్ సాల్వడార్ (7.5 లక్షలు) తర్వాత 7.25 లక్షల మంది భారతీయులదే మూడో స్థానం. ఫలితంగా, ట్రంప్ ప్రతి మాట, ప్రతి అడుగు మనవాళ్ళలో ఆదుర్దా పెంచుతోంది. ఈ పరిస్థితుల్లో ట్రంప్ కొత్త ఏలుబడిలో భారత్‌తో బంధం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరం. మరోపక్క డెమోక్రాట్లను జనం బాధలు పట్టని కులీనులుగా చిత్రించి, సామాన్య పౌరుల సంరక్ష కుడిగా ఎన్నికల్లో తనను తాను చూపుకొన్న ట్రంప్‌ను అతిగా నమ్మి మోసపోయామనే భావన రేకెత్తడం సహజమే. చేతిలోని నియంత్రణ నిర్ణయాలే అండగా ఇటీవలే ఓ బ్రాండెడ్ క్రిప్టో టోకెన్ ద్వారా ఆయన వందల కోట్ల డాలర్ల లబ్ధి పొందాడనే విమర్శలూ గుప్పుమంటున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన 80 ఏళ్ళ తర్వాత కీలక సమయంలో పగ్గాలు చేపట్టిన ట్రంప్ తన మద్దతుదారులకై ఏమైనా చేసేలా ఉన్నారు. 2021లో అమెరికా అధ్యక్ష భవనంపై దాడి చేసిన దాదాపు 1500 మంది దుండగులకూ ఆయన తక్షణం సామూహిక క్షమాభిక్ష ప్రసాదించడమే అందుకు తార్కాణం. నాలుగేళ్ళు విచారించి, శిక్షలు వేసిన న్యాయవ్యవస్థను అలా నూతన అధ్యక్షుడు పరిహసించినట్టయింది. ఆశ్రితులు, ఆర్థిక దాతలు, బంధు మిత్రులకై క్షమాభిక్ష వ్యవస్థను దుర్వినియోగం చేయడంలో నిన్నటి బైడెన్ నుంచి నేటి ట్రంప్ దాకా అందరూ ఒకే తాను గుడ్డలన్న మాట. కాలు మోపిననాడే కాపురం చేసే లక్షణం తెలిసిందన్నట్టు ట్రంప్ 2.0 హయాం ఆరంభమవు తూనే రోజులు ఎలా ఉండనున్నాయో తేటతెల్లమైంది. బహుళ ధ్రువ ప్రపంచం వైపు అంతర్జాతీయ అధికార క్రమం అడుగులేస్తున్న కాలంలో 'అమెరికా ఫస్ట్' నినాదంతో సామాజిక, ఆర్థిక రంగాల్లో ట్రంప్ ఆధిపత్యభావ నిర్ణయాలు రానున్న నాలుగేళ్ళలో ప్రపంచాన్ని కుదిపేయడం ఖాయం.

## హైదరాబాద్‌లో కొత్తగా హెచ్‌సీఎల్ టెక్ సెంటర్

మొదటిపేజీ తరువాయి

ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సీఎల్ హైదరాబాద్ లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సివిజయకుమార్‌తో చర్చలు జరిపారు. హెచ్‌సీఎల్ కొత్త సెంటర్‌లో లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సేవలకు ప్రాధాన్యమిస్తుంది. అత్యాధునిక క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లను అందిస్తుంది. హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటవుతుంది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్ అందుకుంది. దీంతో దాదాపు 5,000 మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయి. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు, ఐటీలో ప్రతిభా వంతులైన నిపుణులతో ఇప్పటికే హెచ్‌సీఎల్ గ్లోబల్ నెట్‌వర్క్ సెంటర్ గా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కొత్త సెంటర్ మరింత అత్యాధునిక సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తుందని హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో హెచ్‌సీఎల్ సేవల విస్తరణను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వాగతించారు. ప్రపంచంలో ఐటీ హబ్ గా హైదరాబాద్ తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకుందని అభిప్రాయపడ్డారు. వచ్చే నెలలో కొత్త సెంటర్‌ను ప్రారంభించాలని ఆహ్వానించారు. స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు హైదరాబాద్‌లోని టెక్నాలజీ, ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

# రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకే రక్షణ లేదు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకు కూడా రక్షణ లేకుండాపోతుందని, కాంగ్రెస్ గూండాలు హద్దులు దాటుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో దివ్యాంగుడైన ఒక మాజీ ఎమ్మెల్యేకే రక్షణ లేదని.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి దుండగులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు. బీఆర్ఎస్‌కు భయపడి నల్గొండ రైతు మహాధర్నాకు అనుమతి ఇవ్వలేదని.. ఫ్లెక్సీలు చింపి, ఏకంగా ఓ ప్రభుత్వ ఆఫీసులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గూండాలు దివ్యాంగుడైన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని బూతులు తిడుతూ పోలీసుల ముందే దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. దాడి చేసింది మంత్రి గూండాలు అయితే.. పోలీసులు భూపాల్ రెడ్డిని అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఫైర్ అయ్యారు. ప్రశ్నించిన తమ నేతను అరెస్ట్ చేసి.. దాడి చేసిన వారిమీద ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇదీ కాంగ్రెస్ అరాచక పాలన తీరని మండిపడ్డారు. తమ నాయకుడు కంచర్ల భూపాల్ రెడ్డి మీద జరిగిన పాశవిక దాడిని ఖండిస్తున్నానన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ ఎక్స్‌లో పేర్కొన్నారు ఇదిలాఉండగా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ తలసాని శ్రీనివాసరావు ఇంట్లో సమావేశమయ్యారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కంచెలు వేసి కాపాడిన ప్రభుత్వ పార్కులకు కాంగ్రెస్ పాలనలో రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతకాదనే నిజాన్నిహైదరాబాద్ ప్రజలు అర్థం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కట్టడాలు, నిర్మాణాల నిర్వహణ కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడాలని ఈ ప్రభుత్వానికి సోయి లేకపోవడం దురదృష్టకరమని అన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై కన్నెత్తి చూసినా ఊరుకోం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రాన్ని 60ఏళ్లు పాలించిన పారిశ్రామిక వ్యర్థాలు మూసీలో కలుస్తుంటే కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. హైదరాబాద్ కు దగ్గర్లో ఉన్న కొండపోచమ్మ సాగర్ ను వదిలేసి దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి మూసీ - గోదావరి అనుసంధానం చేస్తామని ప్రభుత్వం అనడం సరికాదన్నారు. మూసీని కాంగ్రెస్ నాయకులు ఏటీఎంగా మార్చుకోవాలని చూస్తున్నారని కవిత ఆరోపించారు. కాంట్రాక్టర్ల కోసమే ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతోందన్నారు. అందులో భాగంగానే అనుసంధాన ప్రాజెక్టు వ్యయాన్ని రూ.7,500 కోట్లకు పెంచారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. కొండపోచమ్మ నుంచి మూసీ అనుసంధానం చేసే ఆస్కారం ఉన్నప్పటికీ ఈ కొత్త ప్రాజెక్టు ఎందుకని అడిగారు. ఈ విషయంపై నల్లగొండ జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీలో మురుగునీటి శుద్ధి కోసం 31 ఎస్టీపీలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్న కవిత.. మూసీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అప్పట్లోనే ప్రణాళికలు రూపొందించారని గుర్తు చేసుకున్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలపైకి ఇళ్లపైకి బుల్డోజర్లను పంపి, కూల్చివేస్తోందని కవిత ఆరోపించారు. మూసీ ప్రక్షాళనకు అయ్యే వ్యయాన్ని మొదట్లో రూ.50 వేల కోట్లు అని, ఆ తర్వాత రూ. 1లక్ష కోట్లు, మరోసారి లక్షన్నర కోట్లు అని సీఎం చెబుతూ.. మూసీని ఏటీఎంగా మార్చుకొని ఆ డబ్బును ఢిల్లీకి పంపించే ప్రణాళిక చేస్తున్నారని చెప్పారు. మరోపక్క యాదాద్రిలో కేసీఆర్ మొదలుపెట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలన్న కవిత.. యాదాద్రి వైభవాన్ని ప్రభుత్వం కాపాడాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని, అందులో భాగంగానే మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేశారని చెప్పారు. ఫ్లోరైడ్ ని నిర్మూలించిన ఘనత కేసీఆర్ దేనని, ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క వాటర్ ప్లాంట్ పెట్టిన పాపాన కూడా పోలేదని ఆరోపించారు.

## ఎవరెన్ని చెప్పినా నమ్మకండి.. అర్హులందరికీ 4 పథకాలు

మొదటిపేజీ తరువాయి

ఎవ్వరు ఆందోళన చెందవద్దని.. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని.. ఈ సారి లిస్టులో పేర్లు రాని వారు మళ్లీ గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని మరోసారి బలంగా చెప్పారు.

## పెళ్లైన జంటలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి

రేషన్ కార్డుల్లో పేరున్న ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందించనున్నామని చెప్పారు. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అడుగు ముందుకు వేసిందని అన్నారు. ఎంతమందికి అర్హత ఉంటే అంతమందికీ రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు.

పెళ్లయిన వారికి విడిగా కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల మార్పు చేర్పులు అన్ని పూర్తి చేస్తామని అన్నారు. ప్రభుత్వం 40 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇస్తుందని అన్నారు. అందరికీ రేషన్ కార్డు అందిన తర్వాత ప్రతి వ్యక్తికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. అర్హత ఉన్న వాళ్లందరికీ ఇల్లు కట్టించే ప్రక్రియ చేపట్టామని, ఇండ్ల మంజూరు జాబితాలో పేరు లేకుంటే దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. స్వంతస్థలం ఉన్నవారు ఇల్లు కట్టుకునేందుకు ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నామని, ఎస్సీ ఎస్టీలకు మరో లక్ష ఆదనంగా ఇస్తామని తెలిపారు. సాగు చేసేందుకు యోగ్యంగా ఉన్న ప్రతి ఎకరానికి సంవత్సరానికి 12000 రైతు భరోసా ఇవ్వబోతున్నామని తెలిపారు. పంట వేసినా వేయకున్నా వ్యవసాయానికి ముఖ్యంగా ఉంటే రైతు భరోసా అందుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి 12,000 అందజేస్తున్నామని అన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. దరఖాస్తు ఫారం సరిగ్గా నింపకపోవడం వల్ల ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామసభ పూర్తయిన తర్వాత కూడా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వవచ్చని అన్నారు. అన్ని దరఖాస్తులు పరిశీలిస్తామని తెలిపారు. ర్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

## ఇంకెన్నాళ్లు ఇలా దరఖాస్తుల జాతర

మొదటిపేజీ తరువాయి

ప్రజలు ఎన్నిసార్లు ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టాలి? దరఖాస్తు పెట్టిన ప్రతిసారి 30, 40 రూపాయలు ఖర్చు అవుతుందని, ప్రజాపాలనలో అప్లికేషన్ పెట్టాం, మీ సేవలో అప్లికేషన్ పెట్టాం, ఇప్పుడు మళ్లీ గ్రామసభల్లో అప్లికేషన్ పెట్టుకున్నామని ప్రజలు అంటున్నారని, ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను ఆన్ లైన్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆన్ లైన్ దరఖాస్తులు కట్టగట్టి పక్కకు పడేయడం వల్ల మళ్ళీ మళ్ళీ దరఖాస్తులు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. సిద్దిపేట పట్టణం గాడిచర్లపల్లి 15వ వార్డ్ లో నిర్వహించిన గ్రామ సభలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. నిర్బంధాల మధ్య గ్రామసభలు నిర్వహిస్తున్నారని, ఎలక్షన్ల ముందు అందరికీ పరమాన్నం పెడుతామన్నారని, ఇప్పుడు అందరికీ పంగనామాలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో ప్రభుత్వం చెప్పాలని హరీష్ రావు నిలదీశారు.

రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వాన్ని చీమ కుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఎగవేతల సిఎం రేవంత్ రెడ్డి, కోతల రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కోతలు ఎన్నికల తర్వాత ఎగవేతలు అని చురకలంటించారు. రేవంత్ రెడ్డికి నిజాయితీ ఉంటే, చిత్తశుద్ధి ఉంటే యాసంగి వానకాలానికి కలిపి రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదికి ఐదు లక్షల ఇల్లు కడతామని హామీ ఇచ్చారని, ఏడాది పూర్తయిందని ఒక్క ఇల్లయిన ప్రభుత్వం కట్టిందా? అని అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిన ఇల్లులే తప్ప కట్టిన ఇళ్ళు లేవని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎస్సి, ఎస్టిలకు ఇల్లు కట్టుకునేందుకు ఆరు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కోటిమంది కూలీలు ఉంటే కోతలు పెట్టి ఆరు లక్షల మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వడం సరికాదన్నారు. ప్రతి మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వం 30 వేల రూపాయలు బాకీ పడిందని, 13 నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. రేవంత్ రెడ్డి అవ్వాతాతలకు 4000 పెన్షన్ ఎప్పుడు ఇస్తావని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా వానకాలం, యాసంగికి కలిపి 15వేల రూపాయలు ఇవ్వాలని కోరుతున్నామని, వ్యవసాయ కూలీలందరికీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలన్నారు.

## పదేండ్ల తర్వాత గ్రామసభలు.. అర్హులందరికీ పథకాలు అందజేస్తాం: మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి

పదేండ్ల తర్వాత గ్రామ సభలు నిర్వహిస్తున్నందున ప్రజలు ఉత్సాహంగా హాజరవుతున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య బద్ధంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుంటే బీఆర్ఎస్ నాయకులు కావాలని రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. పదేండ్లుగా బీఆర్ఎస్ సర్కారు రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ మాటలు నమ్మి కొందరు ఆర్థిక రాజకీయ, సామాజిక సర్వేలో పాల్గొనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వాళ్లకు పథకాలు రావేమోననే ఆందోళన ఉందని అన్నారు. అర్హులందరికీ పథకాలు అందుతాయని, ఆందోళన చెందవద్దని సీతక్క అన్నారు. గ్రామసభల్లో కూడా దరఖాస్తులు తీసుకుంటామని చెప్పారు. వందల ఎకరాల భూమి ఉన్నవారికి గతంలో రైతు బంధు ఇచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి దావోస్ పర్యటన ముగించుకొని వచ్చాక బీసీ కమిషన్ రిపోర్ట్ పై ఆమోద ముద్రపడుతుందని సీతక్క చెప్పారు. త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తామని, ప్రత్యేక అధికారుల పాలన కారణంగా కేంద్రం నుంచి నిధులు ఆగిపోయాయని అన్నారు. స్కీంలకు దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని చెప్పారు.


## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయి.. మాజీ జడ్పిటిసి హరిదాస్

కబురు న్యూస్ వర్ని, జనవరి22



కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ జడ్పిటిసి హరిదాస్ నాయక్ అన్నారు. వర్ని మండలంలోని చింతల్ పేట్ తాండ గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి హరిదాస్ నాయక్ మాట్లాడుతూ అరులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందుతాయని, రేషన్ కార్డుల దరఖాస్తు నిరంతర ప్రక్రియ అన్నారు. ప్రజలు ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల కొరకు గ్రామ సభలో దరఖాస్తు చేసుకున్నట్లయితే సర్వే నిర్వహించి అనంతరం అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్ఐ రాజేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కుద్వాన్ పూర్ ఎల్లమ్మ ఆలయంలోని దుకాణానికి వేలంపాట



కబురు న్యూస్,నందిపేట,జనవరి 22 :

నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని కుద్వాన్ పూర్ గ్రామ శివారులో గల ఎల్లమ్మ ఆలయానికి సందర్శించే భక్తుల సౌకర్యార్థం పూజా సామాగ్రి మరియు ఇతర సామాగ్రి విక్రయించడానికి దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల25 న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,వేలం పాటలో టెండర్ దక్కించుకున్న వారు 22-02-2025సంవత్సరము నుండి 21-02-2026 వ్యాపారం చేసుకోవచ్చని, బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు వేలం నిర్వహించు తారీఖు 25.01.2025 రోజున ఉదయం 11:30 గంటలకు సమయానికి అరగంట ముందుగా,3000 రూపాయలు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ప్రజలకు అల్పాహారం పంపిణీ...

కబురు న్యూస్,బోధన్ జనవరి 22..



బోధన్ పట్టణంలోని 12వ వార్డులో కొనసాగుతున్న వార్డు సభకు వచ్చిన ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వార్డు ఇంచార్జి పెర్క రామకృష్ణ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజల ఆకలి తీర్చేందుకు అల్పాహారం అందజేసినట్లు ఆయన తెలిపారు.

## రిజిస్టర్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కాటిపల్లి



కబురు న్యూస్ కామారెడ్డి జనవరి 22

కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న రిజిస్టర్ భవన నిర్మాణ పనులను బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల దరఖాస్తు నిరంతర ప్రక్రియ...

# తహసిల్దార్ వరప్రసాద్

- అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

కబురు న్యూస్ బాన్సువాడ, జనవరి,22







అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తహసిల్దార్ వరప్రసాద్ అన్నారు. బుధవారం బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు సంబంధిత అధికారులు హాజరై రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాను గ్రామపంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్ గ్రామస్తులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతనే రేషన్ కార్డు జాబితా వచ్చిందని, జాబితాలో పేర్లు లేని వారు సైతం రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నట్లయితే అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ కార్డుల జారి చేయడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డులు 10 సంవత్సరాలైనా అర్హులైన వారికి రేషన్ కార్డులు రాలేవని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకురాగా, త్వరలోనే అర్హులైన వారందరికీ రేషన్ కార్డుల అందుతాయని అధికారులు ప్రజలకు సమాధానం ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు దరఖాస్తు చేసుకొని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయానికి సాగు అయ్యే భూములకు మాత్రమే రైతు భరోసా పథకం వర్తిస్తుందన్నారు. జాబితాలో అభ్యంతరాలు అంటే గ్రామసభ దృష్టికి తీసుకురావాలన్నారు. దరఖాస్తుల కొరకు సంబంధిత శాఖ అధికారులు కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ ప్రభుత్వ లబ్ధి చేకూరుతుంది..

# సబ్ కలెక్టర్ కిరణ్మయి







కబురు న్యూస్ బాన్సువాడ, జనవరి 22

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని 8, 9, 10, 11, నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో జరిగిన గ్రామసభలలో ఆమె పాల్గొని సంబంధిత అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను వార్డు, గ్రామ సభలలో గ్రామస్తుల మధ్య వినిపించడం జరుగుతుందని, గ్రామస్తులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చి సంబంధిత అధికారులకు తెలియజేయలన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియని గ్రామసభలలో దరఖాస్తు సమర్పించిన వారు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, వార్డు కౌన్సిలర్లు రమాదేవి రాజా గౌడ్, లింగమేశ్వర్, పాశం రవీందర్ రెడ్డి,వెంకటేష్, బీర్కూర్ తహసిల్దార్ లతా, శ్రీనివాస్ రెడ్డి,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ అరవింద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత...

కబురు న్యూస్,బోధన్ జనవరి 22..



ధర్మపురి అరవింద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మరణించిన బిజెపి కార్యకర్తలకు ఆర్థిక సహాయం అందజేశారు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలను ఆదుకునేందుకుగాను ఎంపీ అరవింద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. బోధన్ మండలంలోని పెంటఖుర్దు గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ బూత్ అధ్యక్షుడు కట్పల్లి జయరాం ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తో, లంగ్దాపూర్ బీజేపీ పార్టీ బూత్ అధ్యక్షుడు సుంకర అనిల్ అనారోగ్యంతో, కల్దుర్కి బీజేపీ పార్టీ కార్యకర్త వడ్ల యాదగిరి అనారోగ్యంతో మరణించడం జరిగింది. వీరికి సంబందించిన కుటుంబ సభ్యులకు బుధవారం నిజామాబాద్ నగరంలోని ధర్మపురి అరవింద్ ఫౌండేషన్ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున మూడు లక్షల రూపాయల చెక్కులను బీజేపీ బోధన్ మండల అధ్యక్షులు రాజురె మనోహర్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా నిలబడుతూ వారి సొంత ఫౌండేషన్ ద్వారా సహాయం చేస్తున్న పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ కు బోధన్ బీజేపీ మండల శాఖ, భాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, బోధన్ మండల బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్, శివ కుమార్ అప్ప, బీజేపీ నాయకులు సిర్ప సుదర్శన్, వీరభద్ర తదితరులు ఉన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయి..

# మాజీ సర్పంచ్ బోనాల సుభాష్

కబురు న్యూస్, బాన్సువాడ జనవరి 22





కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ సర్పంచ్ బోనాల సుభాష్ అన్నారు. బుధవారం బాన్సువాడ మండలంలోని హన్మజీపేట్ గ్రామంలో ప్రజా పాలన గ్రామసభను ఏర్పాటు చేయగా అధికారులు రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బోనాల సుభాష్ మాట్లాడుతూ రేషన్ కార్డుల దరఖాస్తు నిరంతర ప్రక్రియని, రేషన్ కార్డుల పై ఎవరు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం ప్రకటన కూడా చేసిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించుకునే వారికి అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వ్యవసాయం సాగు చేసే భూములకే రైతు భరోసా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారి జగదీష్, మాజీ సర్పంచులు బోనాల సుభాష్, బోనాల సాయిలు, ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాను గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్,, సీనియర్ నాయకులు వెంకా గౌడ్, సంజీవులు, వడ్ల శేఖర్, పంచాయతీ కార్యదర్శి రాజేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ లబ్ది చేకూర్చేందుకే ప్రజా పాలన గ్రామ సభలు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి...
- సద్వినియోగం చేసుకోవాలని హితవు...

కబురు న్యూస్,నిజామాబాద్, జనవరి 22 :





సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహిస్తోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు.ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు,రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద లబ్ధి పొందేందుకు గాను అర్హులైన ప్రతి ఒక్కరు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు.ఆర్మూర్ మండలం గోవింద్ పెట్,మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామాలలో బుధవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలలో కలెక్టర్ పాల్గొన్నారు.ఆయా పథకాల కింద అర్హులుగా గుర్తించబడిన వారి ముసాయిదా జాబితాను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు.జాబితాలో పేర్లు లేని వారి నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రస్తుతం గ్రామ సభల్లో చదివి వినిపించిన పేర్లు ముసాయిదా జాబితా మాత్రమేనని,ఇందులో అనర్హులు ఉంటే వారి పేర్లను లబ్ధిదారుల జాబితా నుండి తొలగించడం జరుగుతుందన్నారు.అదే సమయంలో ఇంకనూ ఎవరైనా అర్హులు మిగిలి ఉంటే వారి నుండి దరఖాస్తులు స్వీకరించేందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ సభలు నిర్వహిస్తోందని స్పష్టం చేశారు.ఒకవేళ ఏవైనా కారణాల వల్ల గ్రామ సభలలో ఎవరైనా దరఖాస్తులు చేసుకోలేకపోయిన వారు ఈ నెల 24వ తేదీ అనంతరం మండల పరిషత్ కార్యాలయాలలో గల ప్రజా పాలన సేవ కేంద్రాలలో కూడా దరఖాస్తులు అందించవచ్చని సూచించారు. ఇప్పటి వరకు వివిధ మార్గాల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రూపొందించిన ముసాయిదా జాబితాను ప్రజల పరిశీలన కోసం గ్రామ పంచాయతీ బోర్డులపై అతికించడం జరుగుతుందన్నారు.ముసాయిదా జాబితాలో అనర్హులు ఉన్నట్లు గుర్తిస్తే, అధికారులకు లిఖితపూర్వకంగా లేదా ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని,నేరుగా కూడా సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు.సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని,ముసాయిదా జాబితాలో పేర్లు రాని వారు ఎలాంటి ఆందోళనకు,అపోహలకు గురి కావలసిన అవసరం లేదన్నారు.రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు తదితర పథకాల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి,అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తామని భరోసా కల్పించారు.ఈ మేరకు గ్రామాలలో అర్హులైన వారు ఆయా సంక్షేమ పథకాల కింద దరఖాస్తులు చేసుకునేలా విద్యావంతులు,యువకులు ,గ్రామ పెద్దలు చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు.

### సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి

కాగా,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉందని సుంకెట్ గ్రామసభలో స్థానిక ఎస్.ఐ ప్రజలను అప్రమత్తం చేశారు.సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని ఎవరైనా కొత్త ఫోన్ నెంబర్ల నుండి కాల్ చేస్తే,అలాంటి వారిని నమ్మకూడదని,సంబంధిత అధికారులను సంప్రదించి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్లో బ్యాంక్ ఖాతా నెంబర్లు,ఓటీపీ నెంబర్లు,ఆధార్ కార్డు నెంబర్లు తెలుపవద్దని జాగ్రత్తలు సూచించారు.గ్రామ సభలలో ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్,మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస రావు,మోర్తాడ్ ఎంపీడీఓ బ్రహ్మానందం,తహశీల్దార్ సత్యనారాయణ,మండల వ్యవసాయ అధికారి లక్ష్మతి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ ల క్రికెట్ టోర్నమెంట్ లో ఇందూరు లెవెన్ విజయం



కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 22 :



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఇందూర్ లెవెన్ జట్టు విజయం సాధించింది.జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీలను డిసిపి( అడ్మిన్) బస్వా రెడ్డి బాపూజీ వచనాలయం చైర్మన్ భక్తవత్సలం (ఢిల్లీ) హాజరై ప్రారంభించారు.మొదట బ్యాటింగ్ చేసిన ఇందూర్ లెవెన్ జట్టు(కేసు రాజేష్) 16 నిర్ణిత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి మొత్తం 131 పరుగులు చేశారు.132 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన నిజామాబాద్ లెవెన్ జట్టు (పులగం శ్రీకాంత్)16 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి కేవలం 86 పరుగులు చేసి ఓటమి చెందారు.జర్నలిస్టు అంజు అత్యధికంగా 31 పరుగులు చేశారు.రన్నర్ విన్నర్ జట్లను జర్నలిస్టులు అభినందించారు.

## నేటినుంచి ఖేలో ఇండియా అస్మిత ఫుట్బాల్ టోర్నమెంట్

కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,జనవరి 22 :

కేంద్రం క్రీడాకారులను దృష్టిలో పెట్టుకొని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా అస్మిత టోర్నీలో భాగంగా జిల్లా డాక్టర్ కవిత రెడ్డి ఆధ్వర్యంలో అండర్ 15 బాలికల ఖేలో ఇండియా అస్మిత టోర్నమెంట్ ఈనెల 23న గురువారం ఉదయం 7:30 గంటల నుంచి స్థానిక ఉమెన్స్ కాలేజ్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్బాల్ సంఘం కార్యదర్శి జావిద్ కోచ్ నాగరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నీలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ రంగారెడ్డి, హైదరాబాద్ ఉమెన్స్ ఫుట్బాల్ క్లబ్ ఖమ్మం, ట్విన్ సిటీస్ ఫుట్బాల్ కబ్ హైదరాబాద్, పీకేఆర్ లెవెన్ మంచిర్యాల్, డీకే ఆర్ ఎఫ్ సి నిజామాబాద్, గజ్వేల్ ఎఫ్ సి మెదక్ జట్లు పాల్గొంటున్నాయి. వీరికి లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా ఫుట్బాల్ కార్యదర్శి ఫాల్గుణ రాష్ట్ర బాస్కెట్బాల్ సంఘం అధ్యక్షులు మంథని రాజేందర్ రెడ్డి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఈగ సంజీవరెడ్డి బొబ్బిలి నర్సయ్య నుడా చైర్మన్ కేశవ్ వేణు కార్పొరేటర్లు ఇతర క్రీడా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారని వారు తెలిపారు.

## వార్డు సభలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ...

కబురు న్యూస్,బోధన్ జనవరి 22..




బోధన పట్టణంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన వార్డు సభలను బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ పరిశీలించారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులలో చేపడుతున్న వార్డు సభలను మున్సిపల్ కమీషనర్ వెంకటనారాయణ కమిటీలతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రానివారు ఎవరైనా ఉంటే ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన వార్డు సభలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన తెలిపారు.

## ఫీజు రియంబర్స్మెంట్ విడుదల కాని పక్షంలో కాలేజీల నిరవధిక బంద్

- వీసీ యాదగిరి రావు కు వినతి పత్రం ఇచ్చిన ప్రైవేట్ డిగ్రీ యాజమాన్యాలు...



కబురు న్యూస్,నిజామాబాద్ జనవరి 21 :

ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా బకాయి పడ్డ ఫీజు రీయెంబర్స్ మెంట్ డబ్బులను విడుదల చేయకపోతే కాలేజీల నిరవధిక బంద్ తప్పదని కళాశాలల యాజమాన్యాలు వైస్ ఛాన్సలర్ కు మొరపెట్టుకున్నాయి.ఫీజు రీయెంబర్స్ మెంట్ బకాయిలు విడుదల కాని పక్షంలో కాలేజీలను నిరవధికంగా బంద్ చేస్తామని బుదవారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య యాదగిరి రావుకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ ,పీజీ కళాశాలల యాజమాన్యాలు వినతి పత్రం అందజేశారు.వేల మంది విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పిన తమకు ఫీజు రీయెంబర్స్ మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం జాప్యం చేయడం న్యాయం కాదని అన్నారు.గత సంవత్సర కాలం నుండి సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.భవనాల అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లాలని వీసీకి విన్నవించారు.ఈ కార్యక్రమంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులు హరిప్రసాద్,కార్యదర్శి సంజీవ్,మారయ్య గౌడ్,శంకర్,నరాల సుధాకర్,జైపాల్ రెడ్డి,బాలాజీ,గిరి,శ్రీనివాస్,సుజన్ రెడ్డి,మలేహ,దుష్యంత్,రమణ,శ్రీనివాస్ రెడ్డి,శివాజీ,నవీన్,హరికృష్ణ,సాయిబాబ,శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ క్రీడా పోటీలు...



కబురు న్యూస్,బోధన్ జనవరి 22..



బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోధన్ లోని కోర్టు న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగులకు, న్యాయవాద గుమస్తాలకు ఇండోర్ క్రీడా పోటీలు నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో పలు ఇండోర్ క్రీడలు క్యారమ్స్, చెస్, షటిల్, టెన్నికోయిట్ (మహిళలకు), ముగ్గులు (మహిళలకు) పోటీలు నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఈరడి పోశెట్టి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఆర్. కోటేశ్వరరావు, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి డాక్టర్.పి.సమ్మయ్య లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన క్యారమ్స్ పోటీలో న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి శివ, స్పెషల్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉమేష్ రావు లు పోటీలో పాల్గొన్నారు. న్యాయవాదులు గౌసుద్దీన్, అడ్లూరి శ్రీనివాస్, హనుమంతరావు, గంగారెడ్డి, రవీందర్, ధర్మయ్య, అజయ్, శంకర్ లు ఉన్నారు.

## ఆగ్రోస్ సంస్థకు సంబంధించిన భూములను కాపాడడమే నా లక్ష్యం... కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్

- ఆగ్రోస్ భూములను పరిశీలించిన హైడ్రా అధికారులు

కబురు న్యూస్ హైదరాబాద్, జనవరి 22



రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్ రీస్ సంస్థకు సంబంధించిన భూములను కాపాడి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చి ఆగ్రో సంస్థను లాభాల బాటలు నడిపించడమే తన లక్ష్యమని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. బుధవారం హైదరాబాద్ మౌలాలిలోని 23 ఎకరాల 28 గుంటల భూమి ఉండగా మూడు ఎకరాల భూమి కబ్జాకు గురికావడంతో హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. హైడ్రా అధికారులు ఆదిత్య, హేమలత కబ్జాకు గురైన భూమిని పరిశీలించి హైడ్రా నిబంధనల ప్రకారం ఉన్నత అధికారులకు నివేదిక అందించి చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తాం... మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా

కబురు న్యూస్ వర్ని,జనవరి22



అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా అన్నారు. బుధవారం వర్ని మండలంలోని కూనిపూర్ గ్రామంలో జరిగిన గ్రామసభలో సంబంధిత శాఖ అధికారులు రేషన్ కార్డు,ఇందిరమ్మ ఇండ్ల జాబితాను గ్రామస్తులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ కూనిపూర్ రాజారెడ్డి, తహసిల్దార్ సాయిలు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి... అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

కబురు న్యూస్ పిట్లం, జనవరి 22





వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని స్థానికసంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం పిట్లం మండల కేంద్రంలోని జ్యోతిభా పూలే గురుకులాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లోని విద్యార్థులకు శుభ్రమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు.వంటగది, స్టోర్ రూంలోని సరుకులను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల అధ్యాపకులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ లక్ష్మణుల ఆలయంలో ప్రత్యేక పూజలు...



కబురు న్యూస్,బోధన్ జనవరి 22..
బోధన్ పట్టణంలోని గంజ్ రోడ్ లో గల శ్రీరామ లక్ష్మణుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య నగరంలో శ్రీ బాల రామున్ని ప్రతిష్టించి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం శ్రీరామ లక్ష్మణుల ఆలయంలో వేకువ జాము నుండి పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు విచ్చేసి



స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ రామ లక్ష్మణ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ పూజ కార్యక్రమంలో కిరణ్, శంకర్, సంజీవ్, సుబ్బారావు, రాజు, రమేశ్, సాయిలు, శీను, నాగ కృష్ణ, బాలు, శ్రీను, రామకృష్ణ, నాని, దుబాయ్ శీను, మారుతి, విజయ్, తిలక్, గోపిచంద్, ప్రసాద్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## వ్యభిచార గృహంపై టాస్క్ పోర్స్ దాడి



కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,జనవరి 22 :
నిజామాబాద్ నగరంలో గల వినాయక్ నగర్ లోని పంచముఖి హనుమాన్ టెంపుల్ రోడ్ నెంబర్ 7 లోని ఓ ఇంటిపై టాస్క్ పోర్స్ పోలీసులు దాడి చేశారు.బుధవారం నిజామాబాద్ ఇంచార్జీ సిపి సింధూశర్మ, టాస్క్ ఫోర్స్ ఇంచార్జి ఎసిపి నాగేంద్ర చారి ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సిఐ అంజయ్య,సీసీఎస్ సిబ్బంది దాడులు నిర్వహించారు.ఈ దాడిలో వ్యభిచార గృహం నిర్వాహకులు,ఇద్దరు విటులు,ఇద్దరు మహిళలు ఉన్నారు. వారి వద్ద నుంచి 6 సెల్ ఫోన్లు,రూ.5900 నగదు స్వాధీనం చేసుకుని కేసు నిమిత్తం 4వ టౌన్ పోలీసులకు అప్పగించారు.

## ప్రజలు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి... జిల్లా కలెక్టర్




కబురు న్యూస్ కామారెడ్డి, జనవరి 22

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు కోసం గత ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని వారు గ్రామాలలో ఏర్పాటుచేసిన గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం తాడ్వాయి



మండలం బ్రహ్మాజీవాడి గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామ సభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలలో అర్హత కలిగిన వారి పేర్లు రానివారు దరఖాస్తులు ఆయా కౌంటర్ లలో సమర్పించవచ్చన్నారు. దరఖాస్తులు తీసుకోవడం నిరంతర ప్రక్రియ అని,గ్రామ సభల్లోనే కాకుండా ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజాపాలన కౌంటర్ లో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఇపుడు సమర్పిస్తున్న దరఖాస్తుల పై పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ సభల్లో చదివిన జాబితాలపై అభ్యంతరాలు, ఆక్షేపణలు, చేర్పులు ఉంటే పూర్తివివరాలు గ్రామ సభలో తెలియజేయవచ్చన్నారు. అనంతరం వివిధ పథకాల కోసం ఏర్పాటుచేసిన కౌంటర్ లను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, పంచాయతీ కార్యదర్శి రేణుక, వ్యవసాయ అధికారి నర్సింలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం కృషి చేస్తాం








- మేడిపల్లి ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి సీతక్క...

కబురు న్యూస్,మేడిపల్లి,జనవరి 22 :
తెలంగాణ రాష్ట్రములోని జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం నాడు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దేవి కన్వెన్షన్ హాల్ లో జరిగిన మేడిపల్లి మండల ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అమే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రములో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇండ్లకు ప్రజాపాలన వచ్చాకా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. సమాజంలో నాలుగో స్థంభమైన మీడియాకు మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.జర్నలిస్టుల ఆరోగ్య భద్రత గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశానికి ప్రెస్ అధ్యక్షుడు కల్లూరి ఎల్లయ్య అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శు గడ్డమిది బాల్ రాజు గౌడ్,డీ.వెంకట్ రాం రెడ్డి బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్,అమర్ సింగ్,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్ర రెడ్డి,డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్,ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చిర్ర శ్రీధర్ రెడ్డి,కార్పొరేటర్లు,క్లబ్ కార్యవర్గ సభ్యులు,వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# బోర్డు నిబంధనల ప్రకారం ఫైళ్ళ నిర్వాణ జరగాలి

- సత్య వొకేషనల్ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ...
- తనిఖీలు నిర్వహించిన జిల్లా ఇంటర్ విద్య అధికారి...

కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 22 :
ఇంటర్ బోర్డు రూపొందించిన నియమ నిబంధనల ప్రకారం ఫైళ్ళ నిర్వహణ, కళాశాల నిర్వహణ జరగాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ ఆదేశించారు. నిజామాబాద్ పట్టణంలోని సత్య వొకేషనల్ ప్రైవేటు జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్ బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులను పరిసరాలను పరిశీలించారు.కళాశాల కార్యాలయం సిబ్బంది



కళాశాల యాజమాన్యంతో ఆయన సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు కార్యాలయ రిజిస్టర్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు.ఎలాంటి తప్పిదాలు దొర్లకుండా విద్యార్థుల భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా ప్రతి అంశం పై శ్రద్ధ వహించాలని అన్నారు.విద్యార్థుల డేటాను సరిచేసుకునేందుకు సబ్జెక్టులు మార్చుకునేందుకు,ఫోటో సంతకము తప్పిదం సరిదిద్దుకోవడానికి ఇంటర్ బోర్డు మరో అవకాశం ఇచ్చిందని,డేటాను సరి చేసి కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు.ప్రయోగ పరీక్షలకు సంబంధించి అన్ని పరికరాలను,కంప్యూటర్ల ను సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు పై దృష్టి సారించాలన్నారు.రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలను అతిక్రమించిన ఏ కళాశాలపై అయిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపూడి రవికుమార్ హెచ్చరించారు.కళాశాల ఆవరణ తో పాటు,తరగతి గదులను,ప్రయోగశాలలను,కనీసం అవసరాల కల్పన పై పర్యవేక్షణ తనిఖీ చేశారు.నియమ నిబంధనల ప్రకారం ఫైళ్ళ నిర్వహణ, పాలనాపరమైన అనుమతులు,పరీక్ష ఫీజుల వసూలు,ఇతర అన్ని రిజిస్టర్ లను తనిఖీ చేశారు.ఈ సమావేశంలో ప్రిన్సిపల్,సిబ్బంది, అధ్యాపకులు హాజరయ్యారు.

# ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో మాజీ కార్పొరేటర్ విశాలిని రెడ్డి

- 43వ డివిజన్ వార్డు సభలో స్థానికుల ఆగ్రహం...
- ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులో మాజీ కార్పొరేటర్ విశాలినిరెడ్డి పేరు...
- అధికారులను నిలదీసిన స్థానిక ప్రజలు,కార్పొరేటర్ స్రవంతిరెడ్డి...

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 21 :

నిజామాబాద్ నగరంలోని 43వ డివిజన్ ప్రజాపాలనలో స్థానిక ప్రజలు అధికారులను నిలదీశారు.ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం తర్వాత అర్హులైన వారికి రైతుభరోసా కొత్త రేషన్ కార్డు,ఇందిరమ్మ ఇళ్ళు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం వార్డు సభలు



నిర్వహిస్తున్న విషయం తెల్సిందే.నగరంలోని పాత అంబేద్కర్ భవన్ లో జరిగిన 23వ డివిజన్ వార్డు సభలో ప్రజలు అధికారులను నిలదీశారు.ఇందిరమ్మ ఇండ్ల కమిటి జాబితాలో స్థానిక మాజీ డివిజన్ కార్పొరేటర్ విశాలిని రెడ్డి పేరును 106 సీరియల్ నంబర్ లో పేర్కొనడం పట్ల ప్రజలు మండిపడ్డారు. ఇది వరకు రెండుసార్లు కార్పొరేటర్ గా,ఆమె భర్త చామకూర ప్రభాకర్ రెడ్డి నూడా చైర్మన్ గా పని చేశారు.వారిని ఇందిరమ్మ ఇండ్లకు లబ్దిదారుగా చేర్చడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిని ఏ విధంగా అర్హులుగా చేస్తారని మండిపడ్డారు.అధికారులు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు చెత్తబుట్టపాలు చేశారని మండిపడ్డారు.అనర్హులను ఏ విధంగా జాబితాలో చేర్చారని సర్వే అంతా బూటకమని అన్నారు.సర్వే అంతా కాంగ్రెస్ నాయకుల కనుసన్నుల్లో జరిగిందని, అర్హులను వదిలేసి కాంగ్రెస్ కార్యకర్తలకు పేరు జాబితాలో ఉండడం నిదర్శనమన్నారు.తక్షణమే అనర్హుల పేర్లు జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# జర్నలిస్ట్ విలువలను కాపాడుతున్న యూనియన్

- టీయూడబ్ల్యూజే ఐజేయు డైరీని ఆవిష్కరించిన ఎస్పీ రోహిత్ రాజ్...

కబురు న్యూస్,భద్రాద్రి కొత్తగూడెం,జనవరి 22 :
జర్నలిస్టు విలువలను కాపాడుతున్న యూనియన్ గా టీయూడబ్ల్యూజే ఐజేయు మరింత ముందుకు సాగాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు.బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో టియుడబ్ల్యూజే ఐజేయు డైరీ ని ఆవిష్కరించారు.రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై టి యు డబ్ల్యు జే ఐజేయు యూనియన్ కీలక పాత్ర



పోషిస్తుందని అన్నారు. జర్నలిస్టు విలువలను కాపాడేందుకు మరింత చైతన్యవంతమైన కార్యక్రమాలను సామాజిక బాధ్యతగా నిర్వహిస్తున్న టియుడబ్ల్యూజే ఐజేయు బృందాన్ని అభినందించారు. జిల్లాలోని జర్నలిస్టులకు సంబంధించి లా అండ్ ఆర్డర్ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీయూడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎర్ర ఈశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏర్పుల సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి శంకర్, దశరథ రజువా తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో చేర్చడం ఎవరిది లోపం..?

## - నిలదీసిన మాజీ కార్పొరేటర్ చామకూర విశాలినిరెడ్డి...



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, జనవరి 22 :**

నగర ప్రజలు ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటింటి సర్వేలో భాగంగా మా ఇంటికి వద్దకు వస్తే ఇందిరమ్మ ఇళ్లు మాకు అక్కర్లేదని తిప్పి పంపించడం జరిగిందని మాజీ కార్పొరేటర్ విశాలినిరెడ్డి అన్నారు.ప్రజాపాలనలో భాగంగా బుధవారం అంబేద్కర్ వద్ద జరిగిన వార్డు సభలో అర్హతల జాబితాలో విశాలినిరెడ్డి పేరు రావడంతో ఆమె స్పందించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో తెలంగాణ ఉద్యమకారులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటే వారికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు వారికి పెన్షన్ కూడా ఇస్తామనీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు.తెలంగాణ ఉద్యమకాలంలో నాపై పోలీసు కేసులు కూడా అయినాయి కాబట్టి ఒక తెలంగాణ ఉద్యమ కారిణిగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాను.ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోకపోయినా నా పేరును అందులో చేర్చిన తప్పిదాలు అధికారుల నిర్లక్ష్యమే కారణమని అన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అధికారుల తప్పిదం

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో మాజీ నుడా చైర్మన్ సతీమణి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలి పేరు రావడం రాజకీయంగా దుమారం రేపుతోంది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో సర్వే సిబ్బంది నిర్లక్ష్యం బయట పడింది.నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం జాబితాలో మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి భార్య మాజీ కార్పొరేటర్ విశాలిని రెడ్డి పేరు రావడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.సంక్షేమ పథకాలు అనర్హులకు అందవద్దని,అర్హులైన వారికి ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు ఆయా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూనే ఉన్నారు.జిల్లా కలెక్టర్లు ప్రతిరోజూ సర్వే సిబ్బందికి పకడ్బందీగా,ఎలాంటి తప్పులు దొర్లకుండా సర్వే నిర్వహించాలని ఆదేశించారు.అయినా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ నుడా చైర్మన్ భార్య,మాజీ కార్పొరేటర్ పేరు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో రావడం గమనార్హం.ఇక్కడ సర్వే సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది.సిబ్బంది చేస్తున్న తప్పులకు సమాజంలో రాజకీయ పలుకుబడి ఉన్నోళ్ల పరువు పోయే పరిస్థితి నెలకొంది.దీనిపై జిల్లా కలెక్టర్ ఏలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి..

# స్నేహ సొసైటీ క్యాలెండర్ ను ఆవిష్కరించిన కలెక్టర్..జడ్జి



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 22 :**



స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్ స్ట్రక్షన్ క్యాలెండర్ 2025ను జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం తన చాంబర్ లో ఆవిష్కరించారు.అలాగే జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల స్నేహ సొసైటీలో క్యాలెండర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి,స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి,వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి,దివ్యాంగ బాలలు పాల్గొన్నారు.

# పిరమిడ్ ధ్యాన క్యాలెండరును ఆవిష్కరించిన వినయ్ రెడ్డి



**కబురు న్యూస్,ఆర్మూర్,జనవరి 22 :**



ఆర్మూర్ శివారులోని సిద్దుల గుట్ట వద్ద నిర్మించిన నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మందిర నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు.అనంతరం రవాణా శాఖ కార్యాలయంలో ఎంవిఐ వివేకనంద రెడ్డి క్యాలెండరును ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సాయి కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి,శ్రీనివాస్,రాజు,సత్యం, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పిరమిడ్ ధ్యాన క్యాలెండరును ఆవిష్కరించిన జిల్లా జడ్జి కుంచాల సునీత



**కబురు న్యూస్,నిజామాబాద్ లీగల్,జనవరి 22 :**

ఆర్మూర్ శివారులోని సిద్దుల గుట్ట వద్ద నిర్మించిన నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మందిర నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం జిల్లా జడ్జి కుంచాల సునీత ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సాయి కృష్ణారెడ్డి,లక్ష్మారెడ్డి,శ్రీనివాస్,రాజు,సత్యం,ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటాం



## - ఎంపి అర్వింద్ ధర్మపురి...

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, జనవరి 21 :**

భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటానని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి అన్నారు.బుధవారం నిజామాబాద్ లోని ఆయన కార్యాలయంలో అర్వింద్ ధర్మపురి బూత్ స్థాయి కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా పార్లమెంట్ పరిధిలోని 33మంది బూత్ స్థాయి కార్యకర్తలకు 13.65 లక్షల చెక్కులను అసెంబ్లీ కన్వీనర్లు,మండలాల అధ్యక్షుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో చనిపోయిన,వివాహమైన,నూతన గృహప్రవేశం,హాస్పిటల్ బిల్లులు తదితర కేసులకు తన ఫౌండేషన్ ద్వారా కార్యకర్తలకు తగిన సహాయం చేస్తానన్నారు. కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు ఎంపీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్లు,మండలాల అధ్యక్షులు,భారతీయ జనతా పార్టీ నాయకులు,ఎంపీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జమ్మికుంట రైల్వే స్టేషన్ అభివృద్ధి .....

- ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన సమీక్ష ....
- అయోధ్య దర్శనానికి రైలు నడపడం గూర్చి....
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు... వినతి

**కబురు న్యూస్,జమ్మికుంట జనవరి 22...**

జమ్మికుంట పట్టణంలోని రైల్వే స్టేషన్లో దీర్ఘకాలిక సమస్యలు మరియు ట్రైన్ల నిలుపుదల కోసం మరియు అనేకమంది భక్తులు అయోధ్య దర్శన కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఒక రైలును నడిపించి భక్తులకు సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా జమ్మికుంట పట్టణ కేంద్రంగా సుమారు 7000 మందికి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన శిక్షణ పొందినా లబ్ధిదారులకు తో సమావేశం నిర్వహించాలని కోరగా పై కార్యక్రమాలు నిర్వహణకు హాజరుకావాలని కోరగా వచ్చే నెల పార్లమెంటు సమావేశాలు తరువాత తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ శాఖ అధ్యక్షుడు కొలకాని రాజు, బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ , బిజెపి నాయకులు పొన్నగంటి రవి కుమార్( పి జె ఆర్ ), గాండ్ల సంపత్ , చిర్యాల విజయ్ తదితరులు కలిశారు

# పాఠశాలల్లో క్రీడలు ప్రారంభం.

**కబురు న్యూస్, రామగిరి జనవరి 22.**

కమాన్ పూర్ మండలంలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులతో క్రీడలను ప్రారంభించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎం పి పి ఎస్ రొంపికుంట పాఠశాలలో ఘనంగా ఆటల పోటీలు నిర్వహించారు. గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ఆటల పోటీలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేగోళం సత్యనారాయణ మాట్లాడుతూ తాము చదువుతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యం ఇస్తామని ఆటలు ఆడటం వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదగడంతో పాటు క్రీడా స్ఫూర్తి, జట్టు స్ఫూర్తి, సోదర భావం, గెలుపు ఓటములన్నింటిని సమంగా భావిచడం వంటి భావనలు అభివృద్ధి చెందుతాయాన్నారు. ఈ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గణతంత్ర్య దినోత్సవం రోజున ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. విద్యార్థులకు ఈ పోటీలను ఉపాధ్యాయులు నవత, సంతోష్, వనితలు అద్భుతంగా నిర్వహించారని తెలిపారు. ఈ క్రీడల్లో ఎంఈఓ విజయకుమార్ ఉపాధ్యాయులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ జిల్లా వాసికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశిష్ట అవార్డ్

**కబురు న్యూస్,నిజామాబాద్, జనవరి 22 :**




నిజామాబాద్ జిల్లాకి చెందిన అంకం జ్యోతి ఫౌండేషన్ కి ఇటు మన తెలంగాణలోనే జాతీయ మరియు రాష్ట్రీయ అవార్డులు ఇంకా మదర్ ఇండియా గిన్నిస్ బుక్ రికార్డ్ లో కాకుండా అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా వారు చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి రోడ్డు పైన నివసించే వారికి అన్నదానం మరియు బట్టలు అలాగే దుప్పట్లు పంపిణీ చేయడం అంతే కాకుండా తల్లితండ్రులను కోల్పోయిన పిల్లలకు చదువు చెప్పించడం ఇంకా వృద్ధులను వృద్ధాశ్రమంలో చేర్పించడం,కరోనా సమయంలో వంట సామగ్రి అంతేకాకుండా అంతక్రియలు ఇలా చెప్పుకుంటు వెళ్తే చాలా కార్యక్రమాలు చేసిన ఫలితమే అంకం జ్యోతికి రాజమహేంద్రవరంలో మెడిది సుబ్బయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీన విశిష్ట సేవ రత్న అవార్డ్ కి ఎంపిక కావడం జరిగింది.ఈ సందర్భంగా అంకం జ్యోతి మాట్లాడుతూ,అవార్డ్ కి నన్ను ఎంపిక చేసిన మెడిది వెంకటేశ్వర్ రావుకి ధన్యవాదాలు తెలిపారు.

# బోధన్ లో కాషాయ ధ్వజం ఆవిష్కరణ...

**కబురు న్యూస్,బోధన్ జనవరి 22..**



బోధన్ పట్టణంలోని 37వ వార్డు తట్టీకోట్ లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ల ఆధ్వర్యంలో 55అడుగుల కాషాయ ధ్వజం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అయోధ్య నగరంలో శ్రీ బాల రామున్ని ప్రతిష్టించి ఏడాది పూర్తైన సందర్భంగా బుధవారం నిర్వహించిన ఆవిష్కరణ కార్యక్రమంలో మల్లారం గుట్ట ఆశ్రమం పీఠాధిపతులు శ్రీశ్రీ శ్రీ బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్, బిజేపి రాష్ట కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి విచ్చేశారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేసి వారి చేతుల మీదుగా కాషాయ ధ్వజం ఆవిష్కరించారు. వారి వెంట జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, సురేష్ ఇనాని, మారుతి మందిరం ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహారాజ్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కబురు
KABURU TELUGU DAILY



## 19వార్డు లో ప్రజాపాలన కార్యక్రమం....



కబురు న్యూస్,జమ్మికుంట జనవరి 22....




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్లు మరియు కొత్త రేషన్ కార్డు గత ప్రభుత్వ హయాంలో ఇవ్వనటువంటి ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు గత ప్రభుత్వ హయాంలో మీ సేవ కేంద్రాలలో పెట్టుకున్నటువంటి రేషన్ కార్డులో పేర్ల తొలగింపు మరియు పేర్ల జమచేయుట వంటి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ కోటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి చేపట్టినటువంటి ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్లు మరియు కొత్త రేషన్ కార్డులు పేర్ల మార్పు చేర్పులు ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది సోషల్ మీడియాలో ప్రభుత్వం మీద బురదజల్లే విధంగా వస్తున్నటువంటి వార్తలు ఎవరు పట్టించుకోవద్దు అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మరియు రేషన్ కార్డులు తప్పకుండా ఈ ప్రభుత్వం అందిస్తుంది అర్హులందరికీ అన్ని పథకాలు అందేలా చూస్తామని దేశిని స్వప్న కోటి తెలిపారు.కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ శేఖర్ & శ్రీకాంత్ ఆర్పీ జేరిపోతుల సృజన సిబ్బంది ఉద్యోగులు కోడెం రాజు దూడపాక స్వామి అంగన్వాడి టీచర్ స్వప్న కాంగ్రెస్ నాయకులు దేశిని శ్రీనివాస్ ఎండి సజ్జు ఉడత వెంకటేష్ ఆడెపు దేవరాజ్ ఎండి ఖలీల్ మంద సునీల్ తదితరులు పాల్గొన్నారు

## వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ ఆసుపత్రులపై అసత్య వార్తలు ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు .

కబురు న్యూస్, దినపత్రిక మెదక్ నర్సాపూర్.





బుధవారం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా ఆస్పత్రి మొత్తం అన్ని వార్డులు పరిశీలించి సిబ్బంది, హాజరు పట్టికలు, స్టాక్ రిజిస్టర్లు , రోగులు చికిత్స పొందే వార్డులు పరిశీలించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మందులు లేక రోగుల అవస్థలు అని కొందరు ఆ వాస్తవ వార్తలు వ్యాప్తి చేయడం వీటిపై స్పందించి ఆసుపత్రిని ఆకస్మిక పరిశీలన చేయగా ఇది కేవలం అసత్య కథనం అని వాస్తవాలు లేవని కలెక్టర్ స్పష్టం చేశారు ఆసుపత్రిలో సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని ఎటువంటి లోటుపాట్లు లేవని రోగులు తమంతట తాము చెప్పడం చూస్తే ఆసుపత్రి సిబ్బంది చాలా బాగా పనిచేస్తున్నారని అర్థమవుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు సిబ్బంది విధి నిర్వహణపై నిఘానేత్రాల ద్వారా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుండి పర్యవేక్షణ చేయడం జరుగుతుందని వివరించారు ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న డాక్టర్లను ఈ సందర్భంగా అభినందించారు. డాక్టర్ల మనోధైర్యం దెబ్బతిని విధంగా అసత్య ప్రచారాలు చేస్తే ఇకపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ పావని సంబంధిత వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామ సభలలో జనం గరం గరం..జాబితాలో అనర్హులు... అర్హుల పేర్లు గల్లంతు..

- కొత్త దరఖాస్తులు స్వీకరించిన అధికారులు..

కబురు న్యూస్, వీణవంక, జనవరి 22.



వీణవంక మండలంలో వీణవంక, బొంతుపల్లి,వల్భపూర్, కోర్కల్, మామిడాలపల్లి, నరసింహులపల్లి, పోతిరెడ్డిపల్లి, లస్మక్కపల్లి గ్రామాలలో రెండవ రోజు బుధవారం గ్రామసభలు గందరగోళంగా సాగాయి. మొదటిరోజు మాదిరిగానే గ్రామ గ్రామాన గ్రామ సభలలో నిరుపేదలైన లబ్ధిదారుల పేర్లు రాకుండా, అనర్హుల పేర్లు రావడం ఏందని, అధికారులను ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నించారు. అధికారులు చేసేదేమి లేక మళ్లీ దరఖాస్తు చేసుకోమని, నూతన దరఖాస్తులను స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇస్తామని, నమ్మబలికి, నిరుపేదలకు, దివ్యాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కలిగిస్తామని, అర్హత లేని, ధనవంతుల పేర్లు లిస్టులో వచ్చాయని, ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామ అధికారులు చొరవ తీసుకుని, సంక్షేమ పథకాలపై, సర్వేను పారదర్శకంగా జరిపి, పేదవాడికి న్యాయం చేయాలని, గ్రామగ్రామాన గ్రామ సభల్లో నిరుపేదలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

# విద్యార్థికి నగదును అందించిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు దేశ్ముఖ్...

- విద్యార్థిని, ఉపాధ్యాయుని అభినందించిన హెచ్ఎం....
- ఇష్టంతో విద్యను అభ్యసించాలి..
- హెచ్ఎం నీరజ...

కబురు న్యూస్, శంకరపట్నం జనవరి 22



ఇంగ్లీష్ భాష ఉపన్యాస పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు నగదు ప్రోత్సకాహాన్ని అందించి విద్యార్థిని ప్రోత్సహించడం అభినందనీయమని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం మొలంగూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యను అభ్యసిస్తున్న మూతునూరి చెరితేష్ ఇంగ్లీష్ ఉపన్యాస పోటీలలో ఆంగ్ల భాష పై ప్రావీణ్యాన్ని ప్రదర్శించి ఆంగ్లంలో ఉపన్యాసించినందుకు మండల స్థాయిలో, జిల్లాస్థాయిలో చెరితేష్ ప్రతిభ కనబరిచి తన బోధనకు, పాఠశాలకు జిల్లా స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన విద్యార్థి చెరితేష్ ను అభినందిస్తూ చెరితేష్ ను ఆంగ్ల భాష ఉపన్యాసంలో ప్రోత్సహిస్తున్న పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు దేశ్ముఖ్ సేవలు అభినందనీయమని, ప్రతి విద్యార్థి పోటీ తత్వంతో తన సృజనాత్మకతను ప్రదర్శిస్తూ ప్రతిభ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటాలని, ఇంగ్లీష్ ఉపన్యాసం పై మక్కువ పెంచుకొని చెరితేష్ ఉపన్యాసించి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి, ఇంకా ముందుకు సాగాలని సూచించారు. గ్రామానికి చెందిన నరహరి చిన్న వెంకటరెడ్డి కుటుంబ సభ్యుల అల్లుండ్లు కొమ్మెర చంద్రశేఖర్ రెడ్డి, మాందాడి మనోహర్ రెడ్డి గత సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణతలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు 5116 రూపాయల నగదును అందజేసినట్లు పేర్కొన్నారు ఇట్టి నగదును 26 జనవరి రిపబ్లిక్ డే దినోత్సవం రోజున ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు ప్రతి విద్యార్థి ఇష్టంతో శ్రద్ధతో ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి కన్న తల్లిదండ్రులకు పుట్టిన గ్రామానికి పాఠశాలలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు....

- గ్రామసభలోను సద్వినియోగం చేసుకోవాలి....
- తహసిల్దార్ భాస్కర్...





కబురు న్యూస్, శంకరపట్నం జనవరి 22

అర్హులందరికీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సంక్షేమ పథకాలను అందజేయడం జరుగుతుందని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిర్వహిస్తున్న గ్రామసభలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని సంక్షేమ పథకాలను పొందాలని శంకరపట్నం తాసిల్దార్ బత్తుల భాస్కర్ అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం లోని కేశవపట్నం, ధర్మారం, చింతల పల్లె గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తెలుపు రేషన్ కార్డులు, రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల తాసిల్దార్ బత్తుల భాస్కర్, ఎంపీడీవో గోల్కొండ కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సర్వే బృందాన్ని ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయి పరిశీలనలు, తనిఖీలు, నిర్వహించి గ్రామాల్లో 26వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక కోసం నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందని, ఇట్టి సర్వేలో పాల్గొనని అర్హులైన ప్రతి ఒక్కరూ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రంలో తమ అర్జీలను సమర్పించుకొని అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందవచ్చునని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామసభలు నిర్వహించి గ్రామసభలో ప్రజల ముందు, రాజకీయ పార్టీల నాయకుల ఎదుట, లబ్ధిదారుల ఎంపిక చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాసగొని ప్రభాకర్, మండల పరిషత్ సూపరింట్ రాఘవేందర్ రెడ్డి, ఆర్ ఐ ప్రత్యూష, పంచాయతీ కార్యదర్శులు నరసయ్య, వీర ప్రతాప్, ప్రసన్న, వివిధ రాజకీయ పార్టీల నాయకులు గ్రామస్తులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# అంతిమ దహన సంస్కారాలకు ఆమడ దూరంలో కొత్తపల్లి...

- అసంపూర్తి నిర్మాణం, సరిపడా నిధులు లేక దహన సంస్కారాలకు గ్రామస్తుల ఇబ్బందులు
- స్మశాన వాటికకు తగినన్ని నిధులు కేటాయించాలని గ్రామస్తుల వేడుకలు..

కబురు న్యూస్,హుజురాబాద్ జనవరి 22.....





హుజురాబాద్ పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న ఆ గ్రామానికి ప్రజలకు కావలసిన కనీస సౌకర్యాలు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం అంతిమ సంస్కారాలను నిర్వహించడానికి కూడా సరైన సౌకర్యాలకు గ్రామస్తులు నోచుకోకపోవడం బాధిస్తోంది. గత పదిఏళ్ల క్రితం బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామానికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు స్మశాన వాటికను మంజూరు చేయగా సరిపడ నిధులు లేకపోవడంతో అసంపూర్తిగా మిగిలింది. ఆ నిధులతో రెండు చితి పేర్చే గదులను నిర్మించారు. అప్పటి టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల రవి కృషితో స్మశాన వాటిక వద్ద బోరు, మోటారు మంజూరు చేయగా ఏర్పాటు చేశారు. అయితే స్మశాన వాటికను రోడ్డుకు లెవెల్ గా నేర్పకపోవడం, చితి గదులను ఎత్తులో ఏర్పాటు చేసి చుట్టూ చెట్లు చెదారం పెరిగి పాములకు, తేళ్లకు ఇతర జంతువులకు విష సర్పాలకు నిలయంగా మారింది. దీంతో గ్రామస్తులు ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు అక్కడ చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్మశాన వాటికకు సుమారు 8 గుంటల స్థలం కేటాయించగా దానికి హద్దులు పెట్టకపోవడం, చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడం, కంకర కుప్పలు, మొరం, రాళ్లు రప్పలు ఉండడంతో అంత్యక్రియలు నిర్వహించాలంటేనే అటువైపు వెళ్లడానికి ప్రజలు జంకుతున్నారు. ద్వారము వద్ద పశువులను కట్టేసి పశువుల కొట్టంగా వాడుకుంటున్నారు. ఏపుగా పెరిగిన ముళ్ళ చెట్లు గుంతలతో స్మశాన వాటిక పూర్తిగా నిరుపయోగంగా మారింది. గత ఐదేళ్ల క్రితం కొత్తపల్లి గ్రామం మున్సిపాలిటీలోకి కలువగా నాటి నుండి ఎవరు పట్టించుకోకపోగా, ఏడాది క్రితము కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అధికారులకు, ప్రజాప్రతినిలకు తెలిపిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కొత్తపల్లి స్మశాన వాటికకు శాశ్వత కాంపౌండ్ వాల్, స్నానాల గదులు, అదనపు బోరును మంజూరు చేసి ప్రజలకు అంతిమ సంస్కారాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అణువుగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంవత్సరాల కొద్ది తిరుగుతున్న పట్టించుకోవడం లేదు..!
-ఆకుల రవి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు. కొత్తపల్లి- హుజురాబాద్.

గత 12 ఏళ్లుగా గ్రామానికి స్మశాన వాటిక కావాలని అధికారుల చుట్టూ తిరిగితే నవమాత్రపు నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. గత ఐదేళ్లుగా మళ్లీ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్న ఎవరు పట్టించుకోవడం లేదు. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయగా స్మశాన వాటిక ఎంట్రన్స్ తోరణము, బోరుబావి, మోటారు బిగించడం, రెండు చితి పేర్చే గదులను నిర్మించారు. చితి గదులకు సమానంగా భూమిని చదును చేయకపోవడం రాళ్లూరప్పలు, ముళ్ళ చెట్లు పెరిగిపోవడం, చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడంతో జంతువులకు, విష సర్పాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుని అంతిమ సంస్కారాలు ప్రశాంతంగా నిర్వహించుకునేలా తగిన ఏర్పాట్లు చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుకుంటున్నా.

# టిపిటిఎల్ఎ ప్రెసిడెంట్ గా రహమాన్ నామినేషన్...!

- ప్రవేట్ టీచర్స్,లెక్చరర్స్ సమస్యల కోసం పోరాడుతా...

కబురు న్యూస్, జమ్మికుంట జనవరి 22...




జమ్మికుంట : తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ (టీ పి టీ ఎల్ ఏ ) జమ్మికుంట మండల అధ్యక్షులుగా స్రవంతి జూనియర్ కళాశాలలో లెక్చరర్ గా పనిచేస్తున్న మహమ్మద్ రహమాన్ బుధవారం ఎలక్షన్ కమిటి గా వ్యవహరిస్తున్న డాక్టర్ పుల్లూరి సంపత్ రావు గారికి తమ అనుచరులతో నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా జమ్మికుంట మండల ప్రెసిడెంట్ గా పోటీకి నిలుస్తున్న రహమాన్ మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయులు, లెక్చరర్స్ తమ సమస్యల కోసం పోరాడుతానని, అందరికీ హెల్త్ కార్డులు, పిఎఫ్ లు కట్టించడం కోసం యాజమాన్యాలతో పోరాటం చేస్తానని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు పాఠశాలలు కళాశాలలో పనిచేస్తున్న వారికి సెలవు దినాలు వర్తించేలా కృషి చేస్తానని విద్యావంతులైన ఉపాధ్యాయులు మా విన్నపాన్ని మన్నించి ఈనెల 26న జరిగే ఎన్నికల్లో నాకు ఓటు వేసి గెలిపించగలరని ఓటర్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త మహమ్మద్ అంకూస్, ఉపాధ్యాయులు చుక్క భాస్కర్, కొండ విజయ్, అంజిబాబు, శ్రీనివాస్, కిషన్,రాజేందర్, తబస్సుమ్, స్వప్న, మమత, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



# స్వరాజ్యం గర్వించే మహారాణి

కబురు సినిమా జనవరి 22

దక్షిణాదితో పాటు ఉత్తరాదిలోనూ జోరుగా దూసుకుపోతున్న కథానాయిక రష్మిక . 'పుష్ప 2' మరోసారి పాన్ ఇండియాలో స్థాయిలో అదరగొట్టేసిందీ నాయిక. ప్రస్తుతం చారిత్రక పాత్రలో కనువిందు చేస్తోంది. ఇప్పుడామె, బాలీవుడ్ కథానాయకుడు విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హిస్టారికల్ డ్రామా చిత్రం 'ఛావా'. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో శంభాజీ భార్య ఏసు బాయిగా రష్మిక కనిపించనున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆమె పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. "ప్రతి రాజు వెనక ఓ శక్తిమంతమైన రాణి ఉంటుంది.. స్వరాజ్యం గర్వించదగిన మహారాణి ఏసుబాయి." అనే వ్యాఖ్యలను జోడించింది. మడాక్ ఫిల్మ్స్ పతాకం పై దినేశ్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.




# జయలలిత బయోపిక్.. అందుకే చేయలేదు: నిత్యామేనన్

కబురు సినిమా జనవరి 22

దివంగత నేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఇప్పటికే సినిమా, వెబ్ సిరీస్‌లు విడుదలై ప్రేక్షకులను అలరించాయి. నిత్యామేనన్ కథానాయికగా ప్రియదర్శిని అనే యువ దర్శకురాలు జయలలిత బయోపిక్ చేస్తున్నట్లు 2019లో ప్రకటించారు. 'ది ఐరన్ లేడీ' అంటూ టైటిల్ పోస్టర్ కూడా విడుదల చేశారు. ఈ సినిమా గురించి తాజాగా నిత్యామేనన్ స్పందించారు. సినిమా ప్రకటించి సుమారు ఐదేళ్లు దాటుతున్నా ఎటువంటి అప్‌డేట్ లేకపోవడంపై ఆమె మాట్లాడారు."జయలలిత బయోపిక్ చేయాలని మేము ఎంతగానో ఆశపడ్డాం. చర్చలు కూడా జరిగాయి. మా సినిమా ప్రకటించిన తర్వాత అదే కథతో 'తలైవి' అనే చిత్రం వచ్చింది. మళ్లీ సినిమా చేస్తే రిపీట్ అవుతుందనిపించింది. మా నాన్న మాత్రం.. తప్పకుండా ఆ సినిమాలో యాక్ట్ చేయమని కోరారు. కొంతకాలానికి 'క్వీన్' పేరిట ఒక వెబ్ సిరీస్ కూడా వచ్చింది. అలా, ఒకే కథపై రెండు ప్రాజెక్టులు విడుదలయ్యాక.. మేము సినిమా చేస్తే రిపీట్ చేసినట్లు అవుతుందని భావించా. అందుకే ఆ సినిమా పక్కన పెట్టేశా" అని చెప్పారు.ఇండస్ట్రీలో రాణించడంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. "నాకు సినీరంగం అంటే ఇష్టం లేదు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా జీవితాన్ని ఆస్వాదించాలనేది నా కోరిక. అవకాశం వస్తే వేరే రంగానికి వెళ్లాలని కూడా ప్రయత్నించా. కానీ, జాతీయ అవార్డు నా ఆలోచనల్ని తిప్పికొట్టింది. ఉత్తమ నటిగా నాకు దక్కిన ఈ పురస్కారం నేనేంటో నిరూపించి.. నా జీవితానికి ఓ మార్గాన్ని చూపించింది" అని ఆమె అన్నారు.నిత్యామేనన్ నటించిన తాజా చిత్రం 'కాదలిక్క నెరమిల్లై'. జయంరవి ప్రధాన పాత్రలో నటించారు. జనవరి 14న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలు సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఆమె 'ఇడ్లీ కడై' కోసం వర్క్ చేస్తున్నారు. ధనుష్ స్వీయ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది.

# వీరుల త్యాగాలకు నివాళి

కబురు సినిమా జనవరి 22



"దేశం కోసం సైనికులు తమ కుటుంబ సభ్యులకు దూరంగా.. ప్రాణాలు అర్పించడానికైనా సిద్ధంగా ఉన్నారు.. దీనినే దేశభక్తి అంటారు" అని అక్షయ్ కుమార్ సంభాషణలతో 'స్కైఫోర్స్'లోని ఓ గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. బాలీవుడ్ కథానాయకుడు అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. భారత దేశ మొదటి వైమానిక దాడి ఆధారంగా సందీప్ కేవ్లానీ తెరకెక్కించారు. దినేశ్ విజన్, జ్యోతిదేశ్ పాండే సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా విడుదల సమయం దగ్గరపడడంతో ప్రచార పర్వాన్ని వేగంవంతం చేస్తోంది చిత్రబృందం. తాజాగా ఈ సినిమాలోని 'ఎ మేరే వతన్ కె లోగోన్.." అనే పాటను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "మన వీరుల త్యాగాలకు హృదయపూర్వక నివాళి" అనే వ్యాఖ్యను జోడించింది. దేశభక్తి నేపథ్యంలో సాగుతున్న ఈ పాట సినీ ప్రియుల హృదయాలను హత్తుకుంటోంది. 'ఎ మేరే వతన్ కె లోగోన్..' ఒరిజినల్ గీతానికి దివంగత కవి ప్రదీప్ సాహిత్యం అందించగా.. సి.రామచంద్ర స్వరపరిచారు. దివంగత గాయని లతా మంగేష్కర్ ఆలపించారు. తాజాగా ఈ పాటకు తనిష్క్ బాగ్చీ సంగీతం సమకూర్చారు. సారా అలీఖాన్, వీర్ పహారియా కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది.

# ఆ హిట్ సినిమాకు సీక్వెల్ సిద్ధం: అనిల్ శర్మ

కబురు సినిమా జనవరి 22



సన్నీ దేవోల్ కథానాయకుడిగా అనిల్‌శర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గదర్ 2'. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం అంచనాలకు మించి విజయం సాధించింది. రూ.60 కోట్లతో నిర్మించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.500 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఫలితంగా దీనికి సీక్వెల్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.అనిల్ శర్మ తాజా చిత్రం 'వనవాస్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'గదర్ 3' గురించి అప్‌డేట్ పంచుకున్నారు. అలాగే 'గదర్ 3'లో నానా పటేకర్ విలన్‌గా కనిపిస్తారనే వార్తలపై స్పందించారు. "గదర్ 3' కచ్చితంగా ఉంటుంది. దీనికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం నేను 'వన్‌వాస్'తో బిజీగా ఉన్నాను. ఇది విడుదలైన తర్వాత 'గదర్ 3'ని ముమ్మరం చేస్తాం. త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తాం. నేను నానాపటేకర్‌తో దీనిపై చర్చించాను. అతడు ఈ ప్రాజెక్టులో భాగం కావచ్చు. లేదంటే అతడి కోసం ఓ పాత్రను సృష్టించడానికైనా నేను సిద్ధమే" అన్నారు.'గదర్ ఏక్ ప్రేమ్‌కథ'కు సీక్వెల్‌గా 'గదర్ 2' తెరకెక్కింది. 2023లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించింది. ఇందులో తారా సింగ్, సకీనాల ప్రేమకథకు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. సన్నీ దేవోల్, అమీషా పటేల్ జంటగా నటించిన ఈ చిత్రం ఎన్నో రికార్డులను బ్రేక్ చేసింది. లోక్‌సభ సభ్యుల కోసం కొత్త పార్లమెంటు భవనంలో ప్రదర్శించిన తొలి చిత్రంగా ఘనతను అందుకొంది. దీంతో గదర్ 3పై అంచనాలు పెరిగాయి.

# ఒక్కోసారి మౌనంగా ఉండడం కూడా మంచిదే: రామ్ గోపాల్ వర్మ


కబురు సినిమా జనవరి 22



రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అమితాబ్ బచ్చన్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'సర్కార్'. 2005లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రామ్ గోపాల్ వర్మ ఈ సినిమాను గుర్తుచేసుకున్నారు. అమితాబ్ వల్ల అందులోని ఓ సన్నివేశం అద్భుతంగా వచ్చిందన్నారు. కొందరు నటీనటులు వారి నటనతో సన్నివేశాలను మరోస్థాయికి తీసుకెళ్తారన్నారు."సర్కార్'లో అమితాబ్ తన కుమారుడిని బయటకు వెళ్లమనే సందర్భం వస్తుంది. ఆ సన్నివేశాన్ని ఎలా చేయాలనే దానిపై నాకు, అమితాబ్‌కు మధ్య భిన్నాభిప్రాయాలు వచ్చాయి. కోపంగా అరిచి చెప్పాలని నేను సూచించాను. సర్కార్ అందరిలాంటి తండ్రి కాదు కాబట్టి మరోలా చేయాలని అమితాబ్ చెప్పారు. అంతగొప్ప నటుడితో వాదించడం ఇష్టంలేక నేను మౌనంగా సరే అన్నాను. మరుసటి రోజు రీషూట్ చేద్దామని చెప్పా. ఆరోజు రాత్రి 11 గంటలకు అమితాబ్ నాకు ఫోన్ చేశారు. 'నేను అనుకున్న విధానం కంటే నువ్వు చెప్పిందే బాగుంది. రేపు అలానే రీషూట్ చేద్దాం' అన్నారు. తర్వాత రోజు ఆ సన్నివేశాన్ని రీషూట్ చేశాం. ఆ సీన్‌లో అమితాబ్ అద్భుతంగా నటించారు. నటుడికి, దర్శకుడికి మధ్య అనుబంధం ఎంత గొప్పగా ఉంటుందనేదానికి ఇది ఉదాహరణ. అవతలి వారి ఆలోచనలు మనకు నచ్చకపోతే కొన్నిసార్లు మౌనంగా ఉండాలి. అలా వాదించకుండా మౌనంగా ఉండడం వల్ల కూడా పరిస్థితులు మనకు అనుకూలంగా మారతాయని అర్థం చేసుకున్నా" అని చెప్పారు. తాను ఆశించిన దానికి మించి అమితాబ్ నటించారని వర్మ ప్రశంసించారు.ఇక 'సర్కార్'లో అభిషేక్ బచ్చన్ కూడా నటించారు. అది సూపర్ హిట్ కావడంతో దానికి సీక్వెల్‌గా 'సర్కార్ రాజ్' రూపొందించారు. ఇందులో అమితాబ్, అభిషేక్‌లతో పాటు ఐశ్వర్యారాయ్ కూడా నటించారు. 2008లో విడుదలైన ఈ సీక్వెల్ కూడా విజయాన్ని అందుకుంది.

# త్రిబాణధారి సిద్ధం

కబురు సినిమా జనవరి 22



ప్రముఖ దర్శకుడు మారుతి సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. సత్యరాజ్, వశిష్ఠ ఎన్.సింహ, సాంచిరాయ్, ఉదయ భాను, సత్యం రాజేశ్, క్రాంతి కిరణ్ ప్రధాన పాత్రధారులు. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నారు. విజయపాల్ రెడ్డి ఆడిదల నిర్మాత. విడుదలకి ముస్తాబవుతున్న ఈ సినిమా ప్రస్తుతం తుదిదశ నిర్మాణానంతర కార్యక్రమాల్లో ఉంది. "సరికొత్త అంశంతో రూపొందుతున్న చిత్రమిది. పురాణాలకీ, ఈ కథకీ సంబంధం ఆసక్తికరం. ప్రతి పాత్ర ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ప్రచార చిత్రాలకి మంచి స్పందన లభించింది. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాము"ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి కూర్పు: మార్తాండ్ కె.వెంకటేశ్, సంగీతం: ఇంఫ్యూజన్ బ్యాండ్, ఛాయాగ్రహణం: కుశేందర్ రమేశ్ రెడ్డి.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com